# రెండు నాన్నలు

పి.వి.బి. శ్రీరామమూర్తి

15—6—83

**సాయంకాలం** అయిదయింది.

ఆంజనేయ శాస్త్రి ఆఫీసరు లేకపోవటం వలన హెడ్ గుమాస్తాకి చెప్పేసి రోజుకంటే గంటముందే ఇంటికి బయలుదేరాడు. ఆఫీసులో ఆ రోజు అందిన అదనపు ఆదాయం అతనికి హుషారిచ్చింది. వచ్చి నెల రోజులయినా టిక్కెట్లు దొరకని కొత్త సినిమాకి వెళ్ళాలని మనసు మొరాయించింది. సైకిలుని హాలువేపు పోనిచ్చాడు. అప్పటికే అడ్వాన్సు బుకింగ్ క్లోజయిపోవటం వలన, బ్లాక్‌లో రెండు బాల్కనీ టిక్కెట్లు సంపాదించి, ఇంటికి హుషారుగా వెళ్ళాడు.

అప్పటికే అయిదున్నర దాటి పోతూంది.

ఇంటికి చేరుకుని సైకిల్ని వసండాలో పెట్టి, సోఫాలో కూర్చుని బూట్లు విప్పుకుంటూ ఉండగా, వీధిలో నుంచి లాగుని ఎగదోసుకుంటూ వస్తున్న నాలుగేళ్ళ పుత్రరత్నం రమేషు ఆంజనేయశాస్త్రిని చూసి "అదీ నాన్న" అంటూ మీద పడబోయాడు. వాడి ఒంటికి పట్టిన దుమ్మును చూసి "అరె వెధవ! ఎక్కడ దొర్లావు? ఈ ఒళ్ళు ఏమిటి? ఈ దుమ్మేమిటి? ఉండు... మీద పడకు!" ఆ రోజే తీసిన వైట్ ఫాంటు మాసిపోతుందన్న ఉద్దేశంతో కొడుకును ఒక చేత్తో పట్టుకుని దూరంగా ఉంచి, మరో చేత్తో బూటు విప్పుకుంటున్నాడు. ఉన్నట్టుండి రమేషు రెండు చేతులతో చప్పట్లు కొడుతూ

"అదీ...అదీ. రెండు నాన్నలు... రెండు నాన్నలు!" అని గెంతాడు. సాక్సు వూడ దీసుకునేందుకు కొడుకును విడిచి పెట్టేసరికి వాడు తుర్రున ఇంట్లోకి పారిపోయాడు. సాక్సు తీసి బూట్లో దోపి, బల్ల క్రిందకి వాటిని తోస్తుంటే వాడన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"రెండు నాన్నలు!"

ఆంజనేయశాస్త్రికి గుండె ఝల్లుమంది.

"రెండు నాన్నలేమిటి?" వాడలాగ ఎందుకన్నాడీ ఎంత ఆలోచించినా ఆంజనేయ శాస్త్రికి అర్థం కాలేదు.

ఇంకొక నాన్నెవరు చెప్మా? రాధ వాడికి ఇంకొకర్నెవర్నైనా నాన్న అనుకోవాలని చెప్పిందా? లేక ఇంకెవరయినా వచ్చారా? ఇంతకీ వా డెందు కలా అని ఉంటాడు? అప్పుడు ఆంజనేయశాస్త్రిని పీల్చి చెండాడుతున్న ప్రశ్నలివి. చేవురించి పోయిన ముఖంతో ఇంట్లోకి వెళ్ళాడు. వెళ్ళేసరికి, కాఫీ ఒంపేసినందుకు తల్లి కొట్టిన చెళ్ళుమన్న దెబ్బకి వాడు నేల మీద పడి ఏడుస్తున్నాడు. వా డెందు కేడుస్తుందీ కనిపిస్తున్నా

"ఏమయింది? వాన్నెందుకు కొట్టావ్?" గయ్యమన్నాడు భార్యమీద.

"చూస్తూ అడుగుతారేం మళ్ళీ? చిన్న గ్లాసులో కాఫీ పోస్తే చాలదని కాలితో ఎలా తన్నాడో చూడండి! వెధవ! వీడితో వేగలేకపోతున్నా! ఇందాక స్టౌ మీద గిన్నెను పట్టుకున్నాడు. అద్దాన్ని చెంచాతో కొట్టి విరగొట్టాడు. వీడికి బొత్తిగా భయం లేకుండా పోతూంది." వరుసగా వాడి పనులను ఏకరువు పెట్టింది.

"వాడన్నీ బద్దలు కొడుతుంటే నువ్వేం చేస్తున్నావ్? నువ్వెక్కడి కెళ్ళావ్?" రెండో నాన్న మనసులో వేధిస్తుంటే సూటిగా అడగలేక వక్రంగా ప్రశ్నించాడు.

"ఎక్కడికి పోతానండీ వల్లకాట్లోకి? భోజనం చేసి ఇంట్లో కాస్త కునుకు తీద్దామని రెప్ప వాలిస్తే, వీడి నిర్వాకం ఇది." భార్యామణి కొట్టినట్టు సమాధానం చెప్పేసరికి ఆంజనేయులు నీరు కారిపోయి, నీళ్ళు నమిలేశాడు.

ఆంజనేయులు దగ్గర పెళ్ళాం కెంత భయమో, ఒక్కొక్కసారి పెళ్ళాం హుంకరింపులకి ఆంజనేయులూ అంతే భయపడుతూ ఉంటాడు. నేల మీద పడి దొర్లుతున్న కొడుకును ఎత్తుకుని వూరడిస్తూ "అవునూ, మధ్యాహ్నం మనింటికెవరైనా వచ్చారా?" అని అడిగాడు.

"ఎవ రొస్తారు?" అని భార్య వేసిన ఎదురు ప్రశ్న ఆంజనేయులకి నచ్చలేదు. మళ్ళీ అంతలోనే — "ఆ...వచ్చాడు" అని భార్య అనగానే వేయి ప్రశ్నలూ, సందేహాలూ ఆంజనేయులి మనసులో ధనుస్సులై గుచ్చుకోగా

"ఎవరూ?" అన్నాడు.

"చాకలొచ్చాడు...మీరు లేరని తరువాత రమ్మన్నాను. కానీ వాడు మళ్ళీ వారం రోజులదాకా రావడానికి కుదరదంటే బట్టలన్నీ నేనే వేసి పద్దు రాశాను" అంది.

"చీ...చాకలి వెధవ గురించి కాదు నే నడిగింది" అని ఇంకా ఏం అడగాలో తెలియక కొడుకునెత్తుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఆంజనేయులకి మనసు పీకుతూనే ఉంది. కొడుకును వీధి గుమ్మంలోనికి తీసికెళ్ళాడు. వూరడించాడు. గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

"నాన్నా...ఇందాక రెండు నాన్నలన్నావు కదా? ఎవళ్ళో చెప్తావా?



